క్లుప్తంగా

దీక్షలో హమాలీ యూనియన్ సభ్యులు



దీక్ష శిబిరంలో నాయకులు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని చేస్తున్న దీక్షలు 68వ రోజుకు చేరుకున్నాయి. గురువారం దీక్షలో మార్కెట్ హమాలీ యూనియన్ సంఘం సభ్యులు కూర్చున్నారు. వీరికి పలువురు సంఘీభావం ప్రకటించారు.

సన్మానం

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామంలోని పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందిన వెంకన్నను సర్పంచ్ సాకే ఆనంద్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడు సుకుమార్, హెచ్‌ఎం కృష్ణకుమారి, మమత, తదితరులు పాల్గొన్నారు.

బురదరోడ్డుపై ప్రయాణించేదెలా?



బురదమయంగా దేవాపటార్ రోడ్డు

నార్నూర్: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని దేవాపటార్ రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. బైక్‌లు అదుపు తప్పి, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి భవానిగూడ నుంచి దేవాపటార్ వరకు బీటీరోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆసుపత్రి ఆవరణలో వర్షపు నీరు



ఆస్పత్రి ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

నార్నూర్: భారీ వర్షాలతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి 150 నుంచి 250 మంది రోగులు, వివిధ సబ్‌సెంటర్‌ల నుంచి స్కానింగ్ నిమిత్తం 300పైగా గర్భిణులు, బాలింతలు వస్తుంటారు. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి ఆస్పత్రి రోడ్డు బురదగా మారడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఆసుపత్రి ఆవరణం వర్షం నీటితో చెరువును తలపిస్తోంది. ప్రధాన రోడ్డు నుంచి ఆస్పత్రి వరకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కడెం: గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న యజమానులు జీవో నం.59 కింద దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో రత్నకల్యాణి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జీవో నం .59పై అవగాహన కల్పించారు. మీసేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లిస్తే మూడు రోజుల్లో ఇళ్ల పట్టాలను అందిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, డీటీ చిన్నయ్య తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



పోషణ మాసోత్సవంలో పాల్గొన్న సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని బర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది వరలక్ష్మి, సుప్రియ, గంగామణి, సులేమాన్, పుష్పలత తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

దస్తురాబాద్: వచ్చే ఎన్నికల్లో గెలిచేలా బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించాలన్నారు. చుంచు వెంకన్న, రాజేశం, రాజు, రాయమల్లు, గంగాధర్ పాల్గొన్నారు.న

ఎక్కడి సమస్యలు అక్కడే

- నేడు మండల సర్వసభ్య సమావేశం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



సమస్యలపై నిలదీస్తున్న సభ్యులు (ఫైల్)

తలమడుగు: మండలంలో మూడు నెలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలు చర్చించే సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. సమస్యలు మండలంలో రాజ్యమేలుతున్నాయి. సర్వసభ్య సమావేశాన్ని తుతూమంత్రంగా నిర్వహించి, చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

మండలంలో నెలకొన్న సమస్యలు

- తాహసీల్దార్ కార్యాలయానికి పక్కా భవనం లేదు. ఐకేపీ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్నారు.
- రబీలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న ఇతర పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. వ్యవసాయాధికారులు సర్వే చేపట్టారు. కానీ ఇప్పటికీ నష్టపరిహారం అందించలేదు.
- ఖరీఫ్‌లో 3000 వేల ఎకరాలలో రైతులు పత్తి విత్తనాలు నాటారు. అధికవర్షాలతో పంటలు నష్టపోయాయి. కనీసం ముందస్తుగా అధికారులు రైతులకు అవగాహన కల్పించలేదు.
- ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులకు కోసం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కనీసం మండల కేంద్రంలో బస్టాండ్ లేదు. బస్టాండ్ నిర్మించాలని అధికారులకు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదు.
- మండలంలో అన్ని గ్రామాలకు బీటీ రోడ్డు ఉన్నా.. ఆర్టీసీ అధికారులు గ్రామాలకు బస్సు నడపడంలో విఫలమవుతున్నారు. ప్రైవేట్ వాహనాలలో ప్రయాణం సాగిస్తున్నారు.
- సుంకిడి గ్రామంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఏళ్లుగా మండలవాసులు కోరుతున్నారు. అయినా అడుగులు ముందుకు పడడం లేదు.
- మండల విద్యాధికారి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. దీంతో విద్య వ్యవస్థ పర్యవేక్షణ లేక కుంటుపడే అవకాశం ఉంది.
- దళితులు దళితబంధు రుణాల కోసం ఎదురుచూపులు చుస్తున్నారు. సుంకిడి, లింగి, కుచూలపూర్, రూయ్యడి, తలమడుగు, దేవాపూర్, బరంపూర్, గ్రామాల్లో దళిత కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి.
- బరంపూర్, కుచులపూర్, తలమడుగు పాఠశాలలో మనఊరు.. మనబడి కార్యక్రమంలో తరగతి గదుల నిర్మాణ పనులు నాసిరకం చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
- లచ్చమ్‌పూర్ గ్రామానికి బీటీ రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. బీటీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

ఇలా మూడునెలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంతో తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. కనీసం పూర్తిస్థాయిలో అధికారులు హాజరై సమస్యలపై చర్చించి పరిష్కరించాలని మండలవాసులు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



బోథ్: నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఇచ్చోడ: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దేవుల్‌నాయక్ తండా వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం మాదిగ జాతికి అన్యాయం చేసిందన్నారు. రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాస్తారోకోలో ఎమ్మార్పీఎస్ నాయకులు దుబాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, మధుకర్, పాలెపు గణేష్, చిట్టి రవి, స్వామి పాల్గొన్నారు.

బోథ్: ఎస్సీ వర్గీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం మండలంలోని పొచ్చర క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుపై బైఠాయించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న సీఐ భీమేష్, ఎస్సై రాము ధర్నా వద్దకు చేరుకుని కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. నాయకులు అన్నెపాక అశోక్, కారెం రవి, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండ: రాస్తారోకో చేస్తున్న నాయకులు

నేరడిగొండ: పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాటిచ్చిన బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా.. ఎలాంటి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గజ్జల శంకర్, గజ్జల అశోక్, గజ్జల భోజన్న, నలిగంటి ధర్మన్న, సారంగ రవి, గజ్జల రవి, గజ్జల సంతోష్, చిత్ర గంగాధర్, మెడపట్ల రాజేందర్, నంది రాము, తదితరులు పాల్గొన్నారు.

పిప్పల్‌కోటిలో పశువైద్య శిబిరం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో గురువారం జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. 73 పశువులకు మండల పశువైద్యాధికారి సుభాష్ రాథోడ్ సిబ్బందితో కలిసి గర్భకోశ చికిత్స చేశారు. రైతులు ఎదకు వస్తే తప్పనిసరిగా గర్భకోశ చికిత్స చేయించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, డైరెక్టర్ గోవర్ధన్ యాదవ్, గోపాలమిత్ర మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

వందశాతం పన్ను వసూలు

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీలో వంద శాతం ఇంటి పన్ను వసూలు అయినట్లు సర్పంచ్ బండారి శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌లు తెలిపారు. వివరాలన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామస్తుల సహకారం వల్లే పన్ను వసూల్ సాధ్యమైందన్నారు. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దాసండ్ల ప్రభాకర్ తల్లి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్ ఆయనను పరామర్శించారు. శాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, కందుకూరి రమేశ్, ముజీబ్, సులేమాన్, తదితరులు ఉన్నారు.

అధ్వానంగా సైద్‌పూర్ రోడ్డు



గుంతలమయంగా బేల- సైద్‌పూర్ రోడ్డు

- మరమ్మతులు చేయని అధికారులు
- రాకపోకలకు ఇబ్బందులు

బేల: బేల నుంచి ఏజెన్సీ ప్రాంతంలోని సైద్‌పూర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతులు విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. గత మూడున్నర ఏళ్లుగా బేల నుంచి మశాల(బి) వరకు గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బేల నుంచి సైద్‌పూర్ వైపు పోహార్, ఏకోరి, మశాల(బి), మశాల(కె), బాది, సైద్‌పూర్, సాంగ్వి(జి), తోయగూడ, డౌన, ఖార, దుబ్బగూడ(ఎస్) గ్రామ పంచాయతీలున్నాయి. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వివిధ పనులు నిమిత్తం నిత్యం వస్తుంటారు. జైనథ్ మండలంలోని జామిని, మారుగూడ గ్రామ పంచాయతీల పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు కూడా బేల మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు.

బేల నుంచి మశాల(బి) వరకు అస్తవ్యస్తం..

బేల నుంచి సైద్‌పూర్ 14 కిలోమీటర్లు ఉంటుంది. ఈరోడ్డు మార్గంలో బేల నుంచి మశాల(బి) గ్రామం వరకు 5.5 కిలో మీటర్లు కంకర తేలి, గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా బేల నుంచి తెలంగ్‌రావు గూడ వరకు రాకపోకలకు వీలు లేకుండా మారింది. దీంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మశాల(బి) గ్రామం నుంచి సైద్‌పూర్ వైపుకు మరో 8.5 కిలో మీటర్ల దెబ్బతింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు కంకర తేలి, గుంతలమయంగా మారింది. నాలుగేళ్లుగా మరమ్మతులు చేయించకపోవడంతో ప్రమాదకరంగా తయారైంది. రాకపోకలకు వీలులేకుండా ఉండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

–మెస్రం వికాస్, ఏకోరి

మరమ్మతులు చేయాలి



ఏజెన్సీ ప్రాంతంలోని బేల– సైద్‌పూర్ బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఆటోలు, ప్రైవేటు వాహనాలు వెళ్లేందుకు వీలు లేదు. అధికారులు స్పందించి ప్రయాణ కష్టాలు తీర్చాలి.

– దశరథ్ పటేల్, మశాల(బి)

ఆలయాల అభివృద్ధికి కృషి



గ్రామస్తులకు జీవోకాపీ అందజేస్తున్న అనిల్ జాదవ్

నేరడిగొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు వడూర్, తేజాపూర్, కుంటాల, వాంకిడి, రాజురా గ్రామాల ప్రజలు, యువకులను కలిశారు. మండలంలోని కుంటాల గ్రామంలోని శ్రీ జగదాంబ దేవి– సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి మంజూరైన రూ.43 లక్షల జీవోకాపీని గ్రామస్తులకు అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనిల్‌జాదవ్‌కు మద్దతు

ఇచ్చోడ: మండలంలోని కామాగిరి ఎస్సీ యూత్, కోకస్‌మన్నూర్ యూత్ సభ్యులు గురువారం బీఆర్‌ఎస్ బోథ్ అసెంబ్లీ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను విడివిడిగా కలిసి మద్దతు ప్రకటించారు. అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అనిల్‌కు కలిసిన యువకులు

బోథ్: బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన పలువురు యువకులు గురువారం నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనిల్‌జాదవ్‌ను భారీ మోజారిటీతో గెలిపిస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్‌శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో గురువారం జైనథ్ మండలానికి నలుగున్నర గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదిలాబాద్ పట్టణంలోని సీసీఐ సమీపంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఆదిలాబాద్ రూరల్ మండలం లాండసాంగ్వి గ్రామం మీదుగా జైనథ్ సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. లాండసాంగ్వి గ్రామ సమీపంలో 132/33 విద్యుత్ తీగలకు చెట్ల తీగలు అల్లుకోవడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. అనంతరం అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సామ రాజేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడిగా కళ్లెం సంతోశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొమటిరెడ్డి, చిన్నమల్లారెడ్డి, విజయ్‌రెడ్డి, ముత్యాల రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొమటిరెడ్డి లక్ష్మారెడ్డి, కార్యదర్శులుగా సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, చింతల మల్లారెడ్డి, కోశాధికారిగా బద్దం మహిపాల్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా బాపురెడ్డి, కొమటిరెడ్డి రాంరెడ్డి, చుక్కారెడ్డి, నర్సింహారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సభ్యులుగా ముత్యాల సంజీవరెడ్డి, ముకుందరెడ్డి, రవీందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



నినాదాలు చేస్తున్న పద్మశాలీ నాయకులు



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని గురువారం జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ చౌక్‌లో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ మాట్లాడుతూ.. ఆశయ సాధనకు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కామన్ విఠల్, బాస దత్తు, పెంట వెంకన్న, కొక్కుల ఆడేల్లు, మోర హన్మండ్లు, చిలుక విలాస్, సీఎం ఊషన్న, చిప్ప గంగన్న పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్థంతిని గురువారం పద్మశాలి సంఘం నాయకులు నిర్వహించారు. మండల కేంద్రంలో సంఘం పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధన్నూర్(బి)లో మండల అధ్యక్షుడు సదాశివ్ నివాళులర్పించారు.

నేరడిగొండ: కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట వెంకట రమణ, పద్మశాలి సంఘం నాయకులు పోతన్న, పెంట భోజన్న, ప్రభాకర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

‘సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం’



కైలాస్‌నగర్: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఇంద్రవెల్లి: వర్షంలో అంగన్‌వాడీల ఆందోళన



ఇచ్చోడ: ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ఇంద్రవెల్లి: సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం చేస్తామని అంగన్‌వాడీ టీచర్లు ఎస్. సుభద్ర, పెంటుబాయిలు అన్నారు. గురువారం వర్షంలో కూడా ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, భీమా సౌకర్యం, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆత్రం నాగుబాయి, కుసువర్ధ, నాగుబాయి, లక్ష్మీబాయి, అనిత, సులోచన పాల్గొన్నారు.

ఇచ్చోడ: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు. గురువారం అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. కలెక్టర్ ముట్టడికి ప్రయత్నించిన అంగన్‌వాడీలపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.

ప్రభుత్వం చర్చలు జరుపాలి

కైలాస్‌నగర్: న్యాయమైన డిమాండ్ల నెరవేర్చాలని 11 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, కవిత, కళావతి, శోభ, ప్రమీల, మంజుల, రాధా, కిష్టమ్మ పాల్గొన్నారు.

తాంసి: సమస్యలు పరిష్కారించే వరకు సమ్మె చేస్తామని అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ అన్నారు. భీంపూర్ మండల కేంద్రంలోని శిబిరంలో సమ్మె కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు మీరాబాయి, గంగమ్మ, సుజాత, దేవత పాల్గొన్నారు.

సోయా పంటకు తెగుళ్లు



రంగు మారుతున్న సోయా పంట

తాంసి: సోయా పంటను సాగుచేసిన రైతులు ప్రస్తుతం ఆందోళన చెందుతున్నారు. పంటకు తెగుళ్లతో పాటు వైరస్ సోకడంతో పూర్తిగా రంగు మారుతుంతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన సోయా ప్రస్తుతం కాతదశలో ఉంది. వాతావరణంలో మార్పులు, వైరస్ ఉధృతితో రంగుమారి పచ్చగా కనిపిస్తోంది. మండలంలోని పిప్పల్‌కోటి, తాంసి(కె), గోన, వడూర్, పొన్నారి, హస్నాపూర్, తాంసి, వడ్డాడి గ్రామాల్లో వైరస్ ఉధృతికి పంట దెబ్బతింది. ఇంకా నెల రోజుల్లో చేతికివచ్చే సమయంలో దెబ్బతినడంతో దిగులు చెందుతున్నారు.